హైదరాబాద్
8-8-2023
సంపుటి:08
సంచిక: 338
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# మరలి రాని గానమా...



- కడసారి చూసేందుకు పోటెత్తిన అభిమానులు
- గద్దర్ పార్థివదేహం వద్ద ముఖ్యమంత్రి నివాళి..
- కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పిన కేసీఆర్
- అల్వాల్ మహాబోధి విద్యాలయంలో
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి
- గద్దర్ అంత్యక్రియల్లో.. మృత్యుఒడికి మిత్రుడు

హైదరాబాద్ : మూగబోయిన గొంతులో రాగమెవరూ తీసెదరో.. జీరబోయిన గొంతులో జీవమెవరూ పోసెదరో.. ఆ చిన్నబోయిన సేతికర్రతో సాము ఎవరూ సెసదరో.. ఆ తెగిపోయిన వీణ తీగలను నరాలెవరూ అల్లెదరో.. ఆ తుపాకులకు ఎదురు నడ్సిన తూట ఎవరూ దాసెదరో.. జానపదం జీవకణంలో జీవాక్షరాలెవరో.. అంటూ వాగ్గేయకారుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. గద్దర్ ఇక లేరనే విషయం తెలిసి యావత్తు తెలంగాణవాదులు నివాళి అర్పించారు. ప్రాంతాలకతీతంగా, పార్టీలతో సంబంధం లేకుండా ఆయన పార్థివ దేహాన్ని సందర్శించారు. అశేష జనసంద్రం నడుమ అశ్రు నయనాలతో అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన మరణించారని తెలియగానే దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రభుత్వ యంత్రాంగమే అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. %ఆదివారం దవాఖాన నుంచి పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఎల్బీ స్టేడియంకు తరలించగా, సోమవారం

2లో

# ఆర్టీసీ బస్సుల్లో సీటు బెల్టులు

- కొత్తగా రోడ్డెక్కే ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల్లో ఏర్పాటు
- విమానాశ్రయం, ఐటీ కారిడార్ రూట్లలో సేవలు
- తొలి దశలో 50 బస్సులు.. నెలన్నరలో 25 రాక
- మోడల్ బస్సును పరిశీలించిన ఎండీ సజ్జనార్

హైదరాబాద్: సాధారణంగా కార్లలో సీటు బెల్టులు వాడుతుంటారు. కానీ, తొలిసారి నగరంలో సీట్ బెల్టులుండే సిటీ బస్సులు అందుబాటులోకి రాబోతున్నాయి. విదేశాల్లో బస్సుల్లో కూడా సీటు బెల్టులు తప్పని సరి. వాస్తవానికి మన దగ్గర కూడా బస్సుల్లోనూ సీటు బెల్టులుండాలనే నిబంధ న ఉన్నా అది అమలుకావటం లేదు. తొలిసా రి




# 2025 ఖరీఫ్‌కు పోల‘వరం’

## 9 ఏండ్లుగా అభివృద్ధికి నిర్మాణాత్మకంగా పని

- భూసేకరణ కింద కేంద్రం రూ.6.8 లక్షలు, మనం రూ.3.2 లక్షలు కలిపి ఇస్తాం
- గత సర్కారు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఇష్టం వచ్చినట్లు పనులు చేసింది
- స్పిల్‌వే పూర్తి చేయకుండా డయాఫ్రమ్‌వాల్ కట్టారు

ప్రతినిధి, ఏలూరు: ‘పోలవరం ప్రాజెక్టును 2025 ఖరీఫ్ కల్లా కచ్చితంగా పూర్తిచేసే పరిస్థితి వస్తుంది. 2025 జూలై, ఆగస్టులో 41.15 మీటర్ల పరిధిలో నీటిని నిల్వ చేసే పరిస్థితి కూడా ఉంటుంది’ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు, నిధులకు సంబంధించిన విషయాలపై కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తూ వారికి అర్థమయ్యే రీతిలో



2లో

# మళ్లీ సభకు రాహుల్


## మళ్లీ సభకు రాహుల్.. 4 నెలల తర్వాత పార్లమెంటు సభ్యత్వం పునరుద్ధరణ

- సుప్రీంకోర్టు స్టేతో అనర్హత ఎత్తివేత.. లోక్‌సభకు హాజరైన యువ నేత
- విపక్ష ఎంపీల సాదర స్వాగతం.. అవిశ్వాసంపై చర్చకు ముందు
- ‘ఇండియా’ కూటమిలో ఉత్సాహం.. ద్వేషంపై ప్రేమ విజయమిది
- అవిశ్వాసంపై చర్చలో రాహులే కీలక వక్త
- పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద.. మిఠాయిలు పంచిన కాంగ్రెస్ ఎంపీలు



న్యూఢిల్లీ,: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సుమారు నాలుగు నెలల తర్వాత తిరిగి లోక్‌సభలో అడుగుపెట్టారు. మోదీ ఇంటిపేరుపై తీవ్ర వ్యాఖ్యలు

మిగతా 2లో



# లోక్‌సభ ఆమోదం

- రాజ్యసభలో ‘ఢిల్లీ బిల్లు’ ప్రవేశపెట్టిన అమిత్ షా.. .. దురుద్దేశంతో ఈ బిల్లు తెచ్చారని కేకే విమర్శ ...,
- ‘ఢిల్లీ బిల్లు’కు రాజ్యముద్ర..ల పెద్దల సభలో బిల్లుకు అనుకూలంగా 131 ఓట్లు..
- ప్రతికూలంగా ఓటేసిన 102 మంది.. అవినీతి రహిత పాలనకే ఈ నిర్ణయం తీసుకున్నాం
- లిక్కర్ స్కామ్ వల్లే ఆప్‌కు బీఆర్ఎస్ దన్ను: అమిత్‌షా.. బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- ఢిల్లీలో దొడ్డిదారి పాలనకు బిల్లు: సీఎం కేజ్రీవాల్ ... డేటా పరిరక్షణ బిల్లుకు

మిగతా 2లో

# పోలవరానికి జగన్ శాపం

## మేమే వస్తాం... పూర్వవైభవం తెస్తాం

- 72 శాతం పనులు పూర్తి చేశాం
- ఇప్పుడు తప్పుడు నిర్ణయాలతో సర్వ నాశనం
- కాఫర్ డ్యామ్ గ్యాప్‌లూ సరిచేయలేరా?
- లీకేజీలు నియంత్రించకపోతే డ్యామ్ పూర్తి కాదు
- భారీ వరద వస్తే అన్నీ కొట్టుకుపోయే ప్రమాదం
- పోలవరం ప్రాజెక్టు వద్ద చంద్రబాబు ఆవేదన
- పట్టిసీమ, చింతలపూడి ప్రాజెక్టుల సందర్శన

ఏలూరు/పోలవరం: “పోలవరంలాంటి పెద్ద ప్రాజెక్టు మన రాష్ట్రానికి మళ్లీ మళ్లీ రాదు. 18 నెలలు ఖాళీగా వదిలేస్తే వరదలు వచ్చాక కొట్టుకుపోక ఏమవుతుంది? అప్పర్ కాఫర్ డ్యామ్ గ్యాపులు కూడా పూర్తి చేయలేరా?” అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జగన్ సర్కారును ప్రశ్నించారు. ‘ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధ భేరి’ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన చింతలపూడి, పట్టిసీమ, పోలవరం

మిగతా 2లో



# వాయువేగంతో వెలిగొండ

## దాదాపుగా పూర్తి కావస్తున్న రెండో సొరంగం పనులు

- ఇప్పటికే 17.924 కి.మీ పొడవున తవ్వకం
- మిగిలిన 876 మీటర్ల పనులు అక్టోబర్‌లోగా పూర్తి
- మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13 నాటికే పూర్తి చేసిన సీఎం జగన్
- నల్లమలసాగర్‌కు నీటి తరలింపు ఫీడర్ ఛానల్ ఇప్పటికే పూర్తి
- వైఎస్సార్ హయాంలోనే పూర్తయిన నల్లమలసాగర్

2లో

## సాంపాదకీయం

# ఢిల్లీ బిల్లుపై రాద్ధాంతమెందుకు?

'కేంద్రప్రభుత్వానికి కేంద్ర పాలిత ప్రాంతాలపై రాజ్యాంగం ఇచ్చిన అధికారాల గురించి మాట్లాడండి. పొత్తులకోసం రాజ్యాంగ విలువలను కాలరాచివేయవద్దు' అని ప్రతిపక్షాలకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా హితవు చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వ సేవలకు సంబంధించిన విపక్షాల విమర్శలను దృష్టిలో పెట్టుకుని ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలున్నాయి. ఇతర రాష్ట్రాలతో ఢిల్లీని పోల్చలేము. ఈ విషయం తెలిసినప్పటికీ మోదీ ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పెట్టే ఉద్దేశంతో లోక్‌సభలో ఆ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నిజానికి ఢిల్లీకి సంబంధించి కేంద్రం ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని, ఇప్పుడు ఆ ఆర్డినెన్స్‌ను బిల్లురూపంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని పలువురు కాంగ్రెస్ నేతలు సైతం సమర్థించారు. కేంద్ర ఆర్డినెన్స్ విషయంలో ఢిల్లీ ఆర్డినెన్స్‌కు మద్దతునీయడం రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయాలకు విరుద్ధమని ఢిల్లీ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్రమంత్రి అజయ్ మాకెన్ స్పష్టం చేశారు. అంబేద్కర్, నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు లాంటి నేతలు ఢిల్లీ ప్రభుత్వానికి పరిమిత అధికారాలు మాత్రమే ఉండాలని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. షీలా దీక్షిత్, మదన్‌లాల్ ఖురానా, సాహెబ్ సింగ్ వర్మ, సుష్మా స్వరాజ్ వంటి ముఖ్యమంత్రులకు ఇవ్వని అధికారాలు కేజ్రీవాల్‌కు ఎందుకు కల్పించాలని ఆయన ప్రశ్నించారు. ఈ బిల్లును వ్యతిరేకించడం తప్పు అని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి సందీప్ దీక్షిత్ అన్నారు. నిజానికి సందీప్ దీక్షిత్ తల్లి, కీర్తి శేషురాలు షీలా దీక్షిత్ సైతం ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌తో తలపడడాన్ని తీవ్రంగా విమర్శించడం జరిగింది. 1998 నుంచి 2013 వరకు తాను ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఏ లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ తాను సంఘర్షించలేదని ఆమె ఒక సందర్భంలో గుర్తు చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి, లెఫ్టినెంట్ గవర్నర్ పాత్రను రాజ్యాంగం స్పష్టంగా పునర్నిర్వచించిందని ఆమె చెప్పారు.

# మళ్లీ సభకు రాహుల్



(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో సూరత్ సెషన్స్ కోర్టు ఆయనకు రెండేళ్ల శిక్ష విధించడంతో వయనాడ్ ఎంపీ అయిన ఆయనపై లోక్‌సభ సచివాలయం అనర్హత వేటువేసిన సంగతి తెలిసిందే. గుజరాత్ హైకోర్టు కూడా శిక్షను సమర్థించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. శిక్షపై కోర్టు శుక్రవారం స్టే ఇవ్వడంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ నేతలు స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయనపై అనర్హతను లోక్‌సభ సచివాలయం ఎత్తివేసింది. సుప్రీం స్టే ఆదేశాల దరిమిలా రాజ్యాంగంలోని 102 (1)(2) అధికరణ నిబంధనల ప్రకారం ఆయనపై అనర్హత పోయిందని.. తదుపరి కోర్టు నిర్ణయాలకు లోబడి పునరుద్ధరణ ఉంటుందని నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ సమాచారం అందగానే రాహుల్ సభాప్రవేశం చేశారు. తొలుత పార్లమెంటు ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం లోక్‌సభ వైపు అడుగులు వేశారు. కాంగ్రెస్, 'ఇండియా' కూటమి సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద కాంగ్రెస్ ఎంపీలు మిఠాయిలు పంచారు. సభలో తన తల్లి, ఎంపీ సోనియాగాంధీతో ఆయన కాసేపు గడిపారు. అయితే కాసేపటికే గందరగోళం వల్ల సభ వాయిదాపడింది. పార్లమెంటు వెలుపల రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'భయ్యా, మీరు కూడా సంతోషంగా ఉన్నట్లు కనపడుతున్నారు. ఇది వింతగా లేదూ' అని చమత్కరించారు. ఇంకోవైపు.. ఆయన లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ.. విద్వేషంపై ప్రేమ సాధించిన విజయంగా కాంగ్రెస్ అభివర్ణించింది. మోదీ ప్రభుత్వంపై విపక్ష కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం జరిగే చర్చను రాహులే ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఆయన తమ తరఫున కీలక వక్తగా ఉండాలని భావిస్తున్నామని.. మణిపూర్‌ను సందర్శించి వచ్చిన ఆయన అక్కడి పరిస్థితులపై మాట్లాడతారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ ప్రకటించారు. మణిపూర్ హింసపై విపులంగా చర్చించాలని, ప్రధాని మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి సభ కార్యకలాపాలను 'ఇండియా' కూటమి అడ్డుకుంటున్న విషయం విదితమే. ఈ తరుణంలో రాహుల్ పార్లమెంటు సభ్యత్వం పునరుద్ధరణ విపక్షాల్లో ఆనందోత్సాహాలను నింపింది. కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకున్నాయి.

### దేశ ప్రజలకు ఊరట: ఖర్గే

రాహుల్‌పై అనర్హత తొలగింపును ఖర్గే స్వాగతించారు. 'ఇది దేశ ప్రజలకు.. ముఖ్యంగా వయనాడ్ (కేరళ) నియోజకవర్గ ప్రజలకు ఊరటనిచ్చింది. ఇకనైనా విపక్ష నేతలను టార్గెట్ చేసి ప్రజాస్వామ్యాన్ని న్యూనత పరచకుండా.. బీజేపీ, మోదీ ప్రభుత్వానికి మిగిలిన కొద్ది సమయాన్ని పరిపాలనకు వినియోగించాలి' అని ట్విటర్‌లో సూచించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా కూడా రాహుల్ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణపై హర్షం వ్యక్తంచేశారు. దీంతో ప్రజల అసలు సమస్యలు పార్లమెంటులో మళ్లీ ప్రతిధ్వనిస్తాయని పేర్కొన్నారు. రాహుల్ తన ట్విటర్ బయోను కూడా మార్చుకున్నారు. అనర్హత వేటు పడిన తర్వాత పార్లమెంటు సభ్యుడు అన్న బయో తీసివేసి 'డిస్'క్వాలిఫైడ్ ఎంపీగా పెట్టుకున్నారు. ఇప్పుడు భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు, ఎంపీ అని మార్చుకున్నారు.

### మా వాళ్లనూ పునరుద్ధరించాలి: అఖిలేశ్

రాహుల్ మాదిరిగానే తమ పార్టీ శాసనసభ్యులైన ఆజంఖాన్, ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజంల శాసనసభ్యత్వాన్ని కూడా పునరుద్ధరిస్తారని సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆశాభావం వ్యక్తంచేశారు. రాహుల్ తిరిగి సభకు రావడం భేషుగ్గా ఉందని.. భారత్‌ను బలోపేతం చేస్తారని.. దేశ సమస్యలను తీరుస్తారని ఆశిస్తున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. రాహుల్‌పై అనర్హత తొలగింపు సత్యానికి లభించిన విజయంగా రాజస్థాన్ సీఎం అశోక్ గహ్లోత్ పేర్కొన్నారు. రాహుల్‌కు శిక్షపై సుప్రీం స్టే విధించడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలను బహిర్గతం చేసిందని శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పేర్కొంది.

# పోలవరానికి జగన్ శాపం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులను పరిశీలించారు. తమ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పనులు పూర్తి చేశామని... జగన్ ఈ నాలుగేళ్లలో నాలుగు శాతంతో సరిపెట్టారని మండిపడ్డారు. రివర్స్ టెండర్లను, కాంటూరును 41.15 మీటర్లకు కుదించడాన్ని తప్పుపట్టారు. జగన్ సర్కారు చేసిన తప్పుల వల్ల... ఎంత ఎత్తులో ఉన్నా వరదల్లో ముంపు తప్పని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. భవిష్యత్తులో ఏడు ముంపు మండలాలను కలిపి పోలవరం జిల్లాగా చేసి బాధితులను ఆదుకుంటామని ప్రకటించారు. తాను పోలవరానికి వస్తున్నానని తెలిసే 240 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ డబ్బు అందిస్తున్నారన్నారు.

### సీఎం చేతకానితనం వల్లే...

'పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు, కోర్టు గొడవలు, వివాదాలు, సమస్యల్ని తొలగించి... ఐదేళ్లు కష్టపడ్డాం. ఇప్పుడు పోలవరాన్ని ఇలా చూస్తుంటే బాధ, ఆవేదన, ఒక్కోసారి నిస్సహాయత కలుగుతున్నాయి. ఇక్కడ పట్టుమని పది మంది ఇంజనీర్లు, కూలీలు కూడా పనిచేయట్లేదు. పోలవరం చాలా సున్నితమైన ప్రాజెక్టు. ప్రమాదకరమైన ప్రాజెక్టు కూడా. ఆ ప్రాజెక్టును రక్షించుకోకపోతే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిస్థితి ఏంటి? సీఎం చేతకానితనం పోలవరం ప్రాజెక్టుకు శాపంగా మారింది.. ప్రాజెక్టు ఎత్తు ఎందుకు తగ్గించాలని అడిగితే నంగనాచి కబుర్లు చెబుతున్నారు. ఏమీ తెలుసుకోకుండానే ఇప్పుడు పునరావాసానికి రూ.20 వేల కోట్లు ఖర్చవుతుందని, కేంద్రం ఇస్తే తప్ప తాను పనిచేయలేనని ఎలా చెబుతున్నారు?" అని చంద్రబాబు నిలదీశారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొచ్చే సత్తా తమకు మాత్రమే ఉందని చంద్రబాబు అన్నారు. "50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా అంచనాలతో ప్రాజెక్టును నిర్మించ తలపెట్టాం.

# వాయువేగంతో వెలిగొండ

అమరావతి: ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల స్వప్నం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఫలాలను అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారనడానికి మరో తార్కాణమిది. ప్రాజెక్టు మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13న పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం రెండో సొరంగం పనులను శరవేగంగా కొలిక్కి తెస్తోంది. ఇప్పటికే 17.924 కి.మీ. పొడవున సొరంగం తవ్వకం పనులు పూర్తి కాగా మిగతా 876 మీటర్ల పనులను అక్టోబర్‌లోగా పూర్తి చేసేలా ముమ్మరం చేసినట్లు సీఈ మురళీనాథ్‌రెడ్డి 'సాక్షి'కి వెల్లడించారు.

### శ్రీకారం చుట్టిన వైఎస్సార్

ఈ ఏడాదే శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను వెలిగొండలో అంతర్భాగమైన నల్లమల సాగర్‌కు తరలించి తొలి దశ పూర్తి చేసే దిశగా పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. శ్రీశైలం నుంచి రోజుకు 11,584 క్యూసెక్కులను తరలించి 53.85 టీఎంసీల సామర్థ్యంతో నల్లమల సాగర్‌లో నిల్వ చేసి ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టి పడియ కాలువ ద్వారా 9,500, గుండ్ల బ్రహ్మేశ్వరం రిజర్వాయర్ ద్వారా 3,500, రాళ్లవాగు ద్వారా 1,500) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చే లక్ష్యంతో దివంగత వైఎస్సార్ 2004 అక్టోబర్ 27న వెలిగొండకు శ్రీకారం చుట్టారు.

# ఆర్టీసీ బస్సుల్లో సీటు బెల్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ సిటీ సర్వీసుల్లో ఆ తరహా సీట్లను అందుబాటులోకి తెస్తోంది. నగరంలో మరో నెలన్నరలో అందుబాటులోకి రానున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో ఇవి కనిపించనున్నాయి. ఆ బస్సులు ఎలా ఉండనున్నాయో అధికారులు పరిశీలించేందుకు వీలుగా నమూనా బస్సును సోమువారం బస్‌భవన్‌కు తీసుకురాగా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పరిశీలించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ కారిడార్ మార్గాల్లో తిరిగేందుకు వీలుగా ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను తిప్పాలని ఆర్టీసీ ఇటీవల నిర్ణయించింది. ఇప్పటికే పుష్పక్ పేరుతో 40 ఎలక్ట్రిక్ బస్సులు విమానాశ్రయం మార్గంలో తిరుగుతున్న విషయం తెలిసిందే. అవన్నీ లాభాల్లో ఉండటం, రద్దీకి చాలినన్ని లేకపోవటంతో అదనంగా మరిన్ని బస్సులు తిప్పాలని నిర్ణయించారు. దానితోపాటు ఐటీ కారిడార్‌లో మెట్రో రైలు సేవలు అందుబాటులో లేని రూట్లలో కొన్ని తిప్పనున్నారు.

# యుద్ధనౌకా..సెలవిక

(మొదటి పేజీ తరువాయి)

అక్కడి నుంచి అంతిమయాత్రగా అల్వాల్‌లోని మహాబోధి విద్యాలయానికి తరలించారు. అల్వాల్‌లోని గద్దర్ ఇంటికి పార్థివదేహం చేరుకోగా, భారీ సంఖ్యలో చేరుకున్న ఆయన అభిమానులు, కళాకారులు కుటుంబసభ్యులను ఓదారుస్తూ యుద్ధనౌక.. సెలవిక.. జోహార్ గద్దరన్న అంటూ నివాళి అర్పించారు. మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలతో కలిసి గద్దర్ ఇంటికి చేరుకున్న సీఎం కేసీఆర్ నివాళి అర్పించి, కొడుకు సూర్యం, సతీమణి, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్తూ ఓదార్చారు. అనంతరం పార్థివదేహాన్ని మహాబోధి విద్యాలయానికి తీసుకెళ్లారు. బౌద్ధ సంప్రదాయాలతో చివరి అంతిమ సంస్కారాలు నిర్వహించాక, పోలీసుల గౌరవ వందనం తర్వాత రాత్రి 8.02 గంటలకు అంత్యక్రియలు పూర్తిచేశారు.

### 6 గంటలపాటు అంతిమ యాత్ర

ఎల్బీ స్టేడియం నుంచి సోమవారం ఉదయం 11 గంటల అనంతరం అంతిమయాత్ర ప్రారంభమవగా, ట్యాంక్‌బండ్ మీదుగా 17 కిలోమీటర్లు 6 గంటలపాటు సాగి మహాబోధి విద్యాలయం వరకు చేరుకున్నది. ఎల్బీ స్టేడియానికి దారితీసే రోడ్లన్నింటినీ పోలీసులు భారికేడ్లు వేసి నియంత్రించగా.. అడుగడుగునా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతతో అంతిమయాత్రకు ఏర్పాట్లు చేసింది. ఎల్బీ స్టేడియం నుంచి అంతిమయాత్ర ప్రారంభించగా, మొదట గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం, నెక్లెస్ రోడ్డులోని బాబూ జగ్జీవన్‌రామ్, ట్యాంక్‌బండ్, రాణిగంజ్, జేబీఎస్, కారా?నా, తిరుమలగిరి, లాల్‌బజార్, సుభాష్‌నగర్ మీదుగా అల్వాల్ వెంకటాపురం భూదేవినగర్‌లోని ఆయన స్వగృహం వరకు సాగింది. ఆయన పార్థివదేహాన్ని చూడగానే నాయకులు, ప్రజలు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు.

కుటుంబసభ్యులు, అభిమానులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో బౌద్ధ సంప్రదాయంలో గద్దర్ పార్థివ దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాల ప్రకారం పోలీసులు గౌరవ వందనంగా గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఓవైపు బౌద్ధ మత పెద్దలు అంత్యక్రియలు సమయానుకూలంగా జరిపేందుక ఏర్పాట్లు చేయగా.. చివరి చూపు కోసం భారీగా వచ్చిన జనాలతో కొంత జాప్యం జరిగింది. కుటుంబసభ్యుల వెంటే ఉన్న పైడి జయరాజ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, క్రాంతికిరణ్, కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేశ్, క్రిశాంక్‌తోపాటు పలు పార్టీల నేతలు, సామాజిక, దళిత నాయకులు ముందుండి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహకరించారు.

తన పాటలతో ఉద్యమాలకు ఊపిరిపోసిన గద్దర్ చివరి చూపు కోసం పార్టీలకతీతంగా నేతలు హాజరయ్యారు. మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి ఎమ్మెల్యేలు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు రేవంత్‌రెడ్డి, మల్లు రవి, వీహనుమంతరావు, భట్టివిక్రమార్క, ప్రొఫెసర్ కాశీం, ఘంటా చక్రపాణి, విమలక్క, మొగులయ్య, బీ నర్సింగరావు, దళిత సంఘాలు, ప్రజా కళామండలి, నాట్యమండలి, దళిత సాంస్కృతిక మండలి నాయకులు, కవులు, కళాకారులు, సినీనటుడు ఆర్ నారాయణమూర్తి అశ్రునయనాలతో నివాళి అర్పించారు.

# లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభలో 'ఢిల్లీ బిల్లు' ప్రవేశపెట్టిన అమిత్ షా.. దురుద్దేశంతో ఈ బిల్లు తెచ్చారని కేకే విమర్శ న్యూఢిల్లీ, : మణిపూర్‌పై ప్రతిపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ సోమవారం 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు 2023'ను మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లును కేంద్రం గత వారమే లోక్‌సభలో ప్రవేశపెట్టగా సోమవారం చర్చ చేపట్టారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు కొన్ని సవరణలు ప్రవేశపెట్టగా అవి మూజువాణి ఓటుతో వీగిపోయాయి. ఈ బిల్లు ప్రకారం డిజిటల్ యూజర్ల డేటా గోప్యతను కాపాడలేకపోయినా, సమాచార దుర్వినియోగానికి పాల్పడినా సంబంధిత కంపెనీలపై రూ.50 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఈ చట్టం అమలు కోసం 'డేటా ప్రొటెక్షన్ బోర్డు' ఏర్పాటు చేస్తారు. వ్యక్తిగత సమాచార గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, ఆన్‌లైన్ వేదికలు పౌరుల డేటాను అనుమతి లేకుండా వినియోగించుకోవడాన్ని నిషేధించేలా చట్టం చేయాలని 2017లో సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆరేళ్లకు కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. విస్తృతమైన సంప్రదింపుల తర్వాత ఈ బిల్లు తీసుకొచ్చామని చర్చ సందర్భంగా కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. చర్చలో ప్రతిపక్షాలు పాల్గొనకపోవడాన్ని తప్పుపట్టారు. కాగా, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా 'ఢిల్లీ బిల్లు'ను సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఢిల్లీ ప్రభుత్వంలో సీనియర్ అధికారుల బదిలీలు, నియామకాలపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు నియంత్రణాధికారం కట్టబెట్టే ఈ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ విమర్శించారు. ఈ బిల్లుతో కేంద్రం ఢిల్లీ ప్రజలపై దాడి చేస్తోందని, సమాఖ్య స్ఫూర్తిని ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీ సర్వీసుల బిల్లును దురుద్దేశపూర్వకంగా తీసుకొచ్చారని బీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు అన్నారు. సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తాము ఇండియా కూటమిలో లేమని, అయినా కూడా దేశానికి సంబంధించిన సమస్య వచ్చినప్పుడు శత్రువును ఎదుర్కోడానికి అందరం కలుస్తామని ప్రకటించారు. కాగా, 'ఒత్తిడితోనే బిల్లుకు వైసీపీ మద్దతు ఇచ్చిందని అంటున్నారు. అందరికీ ఒత్తిళ్లు ఉంటాయి. విజయసాయిరెడ్డికి ఉన్న ఒత్తిళ్లు ఎవ్వరికీ అర్థం కాదు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల విమర్శలను బీజేపీ సభ్యులు ఖండిస్తూ ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం అధికారుల బదిలీల్లో అడ్డగోలుగా వ్యవహరించిన తీరు చూస్తే ఈ బిల్లు చాలా అవసరమని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో ఎంపీల కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన లేదని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి లోక్‌సభకు తెలిపారు. వీటిని ప్రాథమికంగా దేశవ్యాప్తంగా బదిలీలు జరుగుతుండే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల కోసం ప్రారంభించారని గుర్తుచేశారు. కేవీల్లో అడ్మిషన్లలో వివిధ కోటాలను కేంద్రం గతేడాది రద్దు చేసింది. వీటిలో ఎంపీల కోటా ఒకటి. కాగా, గోమాతను జాతీయ జంతువుగా గుర్తించాలని ప్రభుత్వం భావిస్తోందా అని బీజేపీ లోక్‌సభ సభ్యుడు భగీరథ్ చౌదరి లిఖితపూర్వకంగా అడిగారు.

# 2025 ఖరీఫ్‌కు పోల'వరం'

(మొదటి పేజీ తరువాయి)

చెప్పామన్నారు. ఇవన్నీ చేసిన నేపథ్యంలో వారిలో కొంత కదలిక వచ్చి సానుకూల వాతావరణంతో ధరలను రివైజ్ చేసి ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసేలా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. పోలవరం ముంపు ప్రాంతం కాంటూరు లెవల్ 41.15 మీటర్ల పరిధిలో ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఎన్నికలకు ముందే ఆరేడు నెలల్లోగా నష్టపరిహారం అందుతుందన్న నమ్మకం ఉందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంపై గట్టిగా ఒత్తిడి తెస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం అల్లూరి సీతారామ రాజు, ఏలూరు జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్ బాధితులను స్వయంగా కలుసుకుని క్షేత్రస్థాయిలో అమలైన సహాయ చర్యలను పరిశీలించారు. కూనవరం, గొమ్ముగూడెంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..

### బుద్ధి లేకుండా బాబు సంతకాలు..

పోలవరం డ్యామ్‌ను మూడు సంవత్సరాల్లో మూడు దశల్లో పూర్తిగా నింపుతారు. అందులో మొదటి స్టేజ్.. మొదటి ఏడాది 41.15 మీటర్ల వరకు నింపుతారు. దశలవారీగా నింపడం ద్వారా ఒక్కో దశలో ఏవైనా లీకేజీలు ఉంటే వాటికి మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. మూడు సంవత్సరాల్లో మూడు ఫేజ్‌ల్లో డ్యామ్‌ను నింపాలని సీడబ్ల్యూసీ నిబంధనల్లో ఉంది. 41.15 మీటర్ల వరకు నింపితే కటాఫ్ అయిపోయే గ్రామాలు ఇంకా ఉంటాయి. వాటిని ఫస్ట్ ఫేజ్‌లోకి తేకుంటే ఆ ఊళ్లకు వెళ్లటానికి ఇబ్బంది అవుతుంది. అందుకనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లైడార్ సర్వే నిర్వహించి 32 గ్రామాల్లో 48 హ్యాబిటేషన్లను (ఆవాస ప్రాంతాలు) మళ్లీ యాడ్ చేయించాం. దీనికి కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం కిందా మీదా పడుతున్నాం. మన ఖర్మకొద్దీ ఇదంతా ఎందుకు మొదలైందంటే గత ప్రభుత్వం 2013%--%2014 రేట్లతోనే పోలవరాన్ని పూర్తి చేస్తామని అండర్ టేకింగ్ ఇచ్చింది. దీంతో అంతకంటే ఎక్కువ డబ్బులివ్వమని, నాటి మీ ముఖ్యమంత్రే ఇందుకు ఒప్పుకుని సంతకం చేశారని కేంద్ర ప్రభుత్వం మొండికేసింది. నేను నేరుగా ప్రధాని, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి వారికి అన్ని రకాలుగా నచ్చచెప్పా. 2013%--%14 రేట్ల ప్రకారం ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ఎలా సాధ్యం? ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు కూడా మారిపోతాయి. గత ప్రభుత్వంలో చంద్రబాబు బుద్ధి లేకుండా సంతకం చేశాడు గానీ మీరైనా ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే కార్యక్రమం చేశా. శ్రీశైలం ప్రాజెక్టు ఎంతతో స్టార్ట్ చేశారు? ఎంతతో పూర్తైంది? ఇవన్నీ వివరించిన తరువాత వారిలో (కేంద్రం) కొంత కదలిక వచ్చింది. సానుకూల వాతావరణం వచ్చింది. ఇప్పుడు ఉన్న రేట్లకు మళ్లీ రివైజ్ చేసి ప్రాజెక్టును పూర్తిచేసేలా అడుగులు వేశాం. ఇది జరగాలంటే కేంద్ర కేబినెట్ ఆమోదించాల్సి ఉంది. దీనికోసం పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ఎస్టిమేట్స్ తయారు చేసి సెంట్రల్ వాటర్ కమిషన్‌కు ఇప్పటికే పంపించింది. వాళ్లు మరో వారంలో అప్రూవల్ ఇస్తారు. ఆ తర్వాత జల్‌శక్తి శాఖ వద్దకు వస్తుంది. అనంతరం కేబినెట్‌లో పెడుతుంది. దేవుడు ఆశీర్వదిస్తే నాకు తెలిసి బహుశా ఈ నెలాఖరు కల్లా కేబినెట్‌కు ఇది వచ్చే కార్యక్రమం జరుగుతుంది.

# ఆగస్టు 9 .10 మహాపడావ్ జయప్రదం చేయండి - Citu

**హైదరాబాద్ (సమ సమాజం):** ఆగస్టు 9 .10వ తేదీన ఇందిరా పార్కులో జరిగే మహాపాడావ్ మహా ధర్నాను జయప్రదం చేయాలని అంబర్పేట సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కరపత్రం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు అంబర్పేట జోన్ కన్వీనర్ జి.రాములు మాట్లాడుతూ నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బరితెగించి ప్రజా కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్నదని జాతీయ సహజ వనరులు ప్రభుత్వ రంగ సంస్థలు కారు చౌకగా స్వదేశి విదేశీ కార్పోరేట్లకు అమ్మేస్తున్నదని, డీజిల్ పెట్రోల్ గ్యాస్ ఇతర నిత్యవసరకులు ధరలు పెంచి ప్రజలు నడ్డి విరుస్తున్నదని విమర్శించారు. అనేక త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోట్లుగా మారుస్తూ పార్లమెంట్లో చట్టం చేసింది. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడింది, పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టం చేసి సమ్మె హక్కును కాలరాస్తున్నది సామాజిక భద్రత కోడు వృత్తి సంబంధిత రక్షణ ఆరోగ్యం పని పరిస్థితిలో కోడులతో పిఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తున్నది, తిరిగి 12 గంటల పని విధానం తెస్తున్నది, కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెరిగి దోపిడికి హద్దే లేకుండా పోతున్నది, సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు ఈ లేబర్ కోర్స్ తో బానిసత్వంలోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వ స్కీములోని కోటిమంది వర్కర్లు ఉద్యోగ భద్రత కనీస వేతనానికి నోచుకోలేదు, ఇండియన్ లేబర్ ఐ ఎల్ సి కార్మిక సంక్షేమ కోసం గతంలో చేసిన తీర్మానాలను చిత్తు కాగితాలుగా మార్చేస్తుంది నిరుద్యోగం పెరిగిపోతున్నది ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 17 లక్షల ఖాళీలు ఉన్నాయి గత మూడేళ్లలో 100 మంది కార్పొరేటర్ సంపద 30 లక్షల కోట్లకు పెరిగింది కేవలం 10 శాతం అత్యంత ధనవంతుల వద్దకు 57 సంపద చేరింది, అత్యంత పేదరికంలో ఉన్న 50 శాతం ప్రజల వద్ద ఆరు శాతం సంపద మాత్రమే ఉన్నది. కార్మిక సమస్యలు పరిష్కరించలేని బిజెపి అసమర్థ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తినీ ధ్వంసం చేస్తూ ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతంతో దళిత గిరిజన క్రైస్తవ ముస్లిం మైనార్టీలు మహిళలు హక్కులకు భంగం కలిగిస్తున్నది కార్మిక వర్గంలో వైశ్యమ్యాలు పెంచుతు, కులం మతం భాషా ప్రాంతీయ భావోద్వేగాలతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నది. స్వదేశీ నినాదంతో అధికారులకు వచ్చిన బిజెపి విదేశీ కార్పొరేట్ సంస్థలకు సంపదనంత దోచుపెడుతున్నది, ఈ కేంద్ర బిజెపి వినాశకర చర్యలు అన్నిటిని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కొని పోరాడాలనీ ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ద ఈ కార్యక్రమంలో సిఐటియు అంబర్పేట నాయకులు వీర్య, భాస్కర్, ధర్మానాయక్, రాజు, వినోద, కాంతి, తదితరులు పాల్గొన్నారు.




# జిపి కార్మికులను పర్మినెంట్ చేయాలి

**బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరు**

**చండూరు (సమ సమాజం):** తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆలోపు పిఆర్సి జీవో 60 ప్రకారం 19 వేల కనీస వేతనాలు అమలు చేయాలని జేఏసీ జిల్లా చైర్మన్ చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చండూరు మండల కేంద్రంలో జేఏసీ పిలుపులో భాగంగా రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చిన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రమాదకరమైన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్ లకు ప్రత్యేక హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్,డిపిఓ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, సర్పంచులకు వినతి పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం స్పందించలేదు కాబట్టే జులై 6 నుండి సమ్మెలోకి వెళ్లారని అన్నారు.కార్మిక సమస్యలు పరిష్కరించకుండా అధికారులు అదిరించి బెదిరించి సమ్మెను విచ్చిన్నం చేయాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోటీ కార్మికులను పెడితే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి కార్మికుల మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న జేఏసీ రాష్ట్ర కమిటీ తోటి చర్చలు జరిపి పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు బండ శ్రీశైలం మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా కార్మికులు కొన్ని హక్కులు సాధించుకున్నారని, వాటిని నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మార్పులు చేస్తూ కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి గ్రామపంచాయతీ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను విచ్చిన్నం చేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెరుపోతుల ధనంజయ, గ్రామపంచాయతీ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఏర్పుల సైదులు, నాంపల్లి శంకర్, దోటీ సుజాత, చారి, వెంకటయ్య, పుష్ప, లింగమ్మ, గడం బిక్షం, మహేందర్, అబ్బయ్య, సతీష్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

**మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి**



**జగిత్యాల, (సమ సమాజం):** తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొని తన ఆట, పాటలతో ప్రజలను చైతన్యం చేసి రాష్ట్ర సాధనలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ కీలక పాత్ర పోషించారని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు గిరి నాగభూషణం, బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి లు కొనియాడారు. ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ లేని లోటు పూడ్చలేనిదని, తెలంగాణ ఉద్యమంలో తన ఆట,పాటలతో ఉద్యమానికి ఊపిరిపోసి, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారన్నారు. జగిత్యాలతో గద్దర్ కు అవినాభావ సంబంధం ఉందన్నారు. పెత్తందారుల, దొరల పాలనకు వ్యతిరేకంగా 1978, సెప్టెంబర్ 9న జగిత్యాలలో జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో తన ఆట,పాటలతో ఉద్యమానికి స్ఫూర్తినింపారని గుర్తు చేసుకున్నారు. పీడిత, తాడిత ప్రజల పక్షాన తన పాటలతో అండగా నిలిచారని, ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. గద్దర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని చెబుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న ఖమ్మం బహిరంగ సభలో గద్దర్ పాల్గొని, తన ఆట, పాటలతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్తేజం నింపారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా మధు, పులి రామ్, మొయిజోద్దీన్, పీఏ గంగాధర్, అజార్, చాంద్ పాషా, మన్సూర్ , నేహాల్, ఎలిగేటి నర్సయ్య, అల్లాల రమేష్ రావు, చిట్ల అంజన్న, బొల్లి శేఖర్, నాంచారి రాజు, హబీబ్, పెద్దులు, గాజుల రాజేందర్, క్యాతం రాములు, చిట్ల లత, దివాకర్, లక్ష్మణ్, చెట్టె భార్గవ్, జుంబర్తి కిశోర్, కోండ్ర రాజేశ్, బోగ సందీప్, రాగుల ప్రదీప్, గిరిధర్, అసీం సావన్, శ్రీపాద సంతోష్, నాగేంద్ర, అర్బాబ్, నదీం, అతాహుల్లా షరీఫ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలి.

**వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**


**మైనారిటీల సంక్షేమం క్రింద లక్ష సహాయం కోసం లబ్దిదారుల ఎంపిక పూర్తి**

**ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి గృహలక్ష్మి క్రింద 3 వేల ఇండ్ల కేటాయింపు**



**జగిత్యాల, (సమ సమాజం):** నిర్దేశించిన మేరకు ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి , ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరి భూముల క్రమబద్ధీకరణ, బీసి, మైనారిటీ లకు లక్ష ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి పలు అంశాల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్.లత, టి.ఎస్.దివాకర సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం క్రింద ఉన్న లక్ష్యాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని, దానికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలని అన్నారు. నీటి పారుదల శాఖ పరిధిలోని భూములలో ఏర్పాటు చేస్తున్న సంపద వనాలలో లక్ష్యం మేరకు మొక్కలు నాటే ప్రక్రియ 2 వారాల్లో పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. జిల్లాలో హరితహారం క్రింద మొక్కలు నాటడంతో పాటు మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని సీఎస్ తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం క్రింద జిల్లాలకు ఇప్పటి వరకు నిర్దేశించిన లక్ష్యం త్వరితగతిన చేరుకోవాలని సీఎస్ సూచించారు. ఈ వారం నుంచి ప్రతి జిల్లాకు గొర్రెల యూనిట్ల పంపిణీ లక్ష్యం రెట్టింపు చేశామని, గొర్రెల యూనిట్ల కొనుగోలు వేగవంతం చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు. గొర్రెల యూనిట్ల కొనుగోలు బృందంలో జిల్లా స్థాయి అధికారి తప్పనిసరిగా ఉండాలని అన్నారు. జిల్లాలో స్థానిక ప్రజా ప్రతినిధులచే గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని, సదరు సమాచారం సామాజికమాధ్యమాల్లో ప్రచారం చేయాలని సిఎస్ తెలిపారు. బీసి కులవృత్తుల లక్ష రూపాయల ఆర్థిక సహాయం క్రింద మొదటి దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 300 మంది లబ్దిదారులకు అందించడం జరుగుతుందని, దీనికి సంబంధించిన నిధులు జిల్లాలకు విడుదల చేశామని, ప్రతి అసెంబ్లీ పరిధిలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యేలతో ఆగస్టు 10 లోపు చెక్కుల పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. మైనారిటీల సంక్షేమం క్రింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకంలో జనాభా ప్రాతిపదికన జిల్లాలకు లక్ష్యాలు నిర్దేశించామని అన్నారు. జిల్లాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు లబ్దిదారులను ఎంపిక చేసి ప్రొసిడింగ్స్ జారీ చేయాలని, ప్రొసిడింగ్స్ జారీ చేసిన వెంటనే నిధులు మంజూరు అవుతాయని చెక్కుల పంపిణీ చేపట్టవచ్చని అన్నారు. గృహలక్ష్మి పథకం క్రింద జిల్లాలో తహసిల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆగస్టు 10 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి గృహలక్ష్మి క్రింద 3 వేల ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటి వరకు జిల్లాలో ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను, ఆగస్టు 10 వరకు వచ్చే దరఖాస్తుల జాబితా రూపొందించి ఆగస్టు 20 నాటికి క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. జిల్లా ఇంఛార్జి మంత్రిచే లబ్దిదారుల జాబితా ఆమోదింపజేసుకొని ఆగస్టు 25 నాటికి గృహలక్ష్మి ఇండ్ల మంజూరు పూర్తి చేయాలని అధికారులను సీ ఎస్ ఆదేశించారు. రెండవ దశలో ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 1100 మంది లబ్ధిదారులకు దళిత బంధు పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎస్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే లో సమన్వయంతో దళిత బంధు లబ్దిదారులను ఎంపిక చేయాలని సీఎస్ అన్నారు. దళిత బంధు లబ్దిదారులను ఎంపిక చేసిన తరువాత లబ్దిదారులకు మార్కెట్ లో అందుబాటులో ఉండే వివిధ రకాల వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, లబ్దిదారుల ఎంపిక పూర్తయితే నిధులను జిల్లా కలెక్టర్లకు విడుదల చేయడం ప్రారంభిస్తామని సీఎస్ అన్నారు. సోషల్ వెల్ఫేర్ శాఖ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. జూలై మాసంలో వచ్చిన వరదల కారణంగా పట్టాల పంపిణీ ఆలస్యమైందని, స్థానిక ఎమ్మెల్యే సమయం తీసుకుని త్వరితగతిన పంపిణీ పూర్తి కావాలని అన్నారు. ప్రభుత్వ కారుణ్య నియామకాల కోసం 1266 కార్యాలయ సబార్డినేట్ పోస్టులు జూనియర్ అసిస్టెంట్ గా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు సంఖ్య 79 విడుదల చేసిందని, దాని ప్రకారం జిల్లాలో 10 రోజులలో నియామక ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ అన్నారు. కారుణ్య నియామకాల కింద డిగ్రి అర్హత ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్, మిగిలిన వారికి కార్యాలయ సబార్డినేట్ పోస్టులు కింద భర్తీ చేయాలని అన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ జిల్లాలో చాలా శాతం పూర్తయిందని, పెండింగ్ లో ఉన్న పట్టాలను త్వరితగతిన పంపిణీ చేయాలని అన్నారు. జిల్లాలో అటవీ భూమి తదుపరి ఆక్రమణకు గురీ కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద క్రమబద్ధీకరణ కోసం ఎంపికైన లబ్దిదారుల నుంచి రుసుము వసూలు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద పలుమార్లు నోటిసు జారీ చేసినప్పటికీ స్పందన లేని లబ్దిదారుల ఇండ్ల కూల్చివేతలు ప్రారంభించాలని సీఎస్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు 58 కింద ఉచితంగా పేదలకు క్రమబద్ధీకరణ పూర్తి చేశామని, ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద పెండింగ్ రుసుము 3 వారాలో వసూలు చేయాలని సీఎస్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణ కు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. 125 గజాల కంటే తక్కువ ఉన్న నోటరి భూములను స్టాంప్ డ్యూటీ లేకుండా క్రమబద్దికరిస్తామని, 125 గజాల కంటే ఎక్కువ ఉన్న నోటరి భూములను స్టాంప్ డ్యూటీ వసూలు చేసి క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ మీ సేవా ద్వారా నోటరి భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుల స్వికరిస్తున్నామని, దీని పై పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. నోటరి భూముల కింద ఇప్పటి వరకు ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని అన్నారు. ఈ వీడియో సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇది చేతల ప్రభుత్వం,చేనేతల ప్రభుత్వం.నేతన్నలకు కేసీఆర్ ఒక భరోసా:ఎల్.బి.నగర్ శాసనసభ్యులు.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ,(సమ సమాజం):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని అనంతవేణి నగర్ కాలనీ నందు శ్రీభావన ఋషీదేవ చేనేత సహకరసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు .దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ఆదరిద్దాం.నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుదాం అని కోరారు.తెలంగాణ ప్రభుత్వం రైతు బీమా మాదిరిగానే నేతన్నల సంక్షేమానికి నేతన్న బీమా పేరుతో 14.08.2022 నుండి పథకాన్ని అమలు చేస్తున్నది.ఈ పథకం క్రింద నమోదు అయిన నేతన్నలు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది.మే 2023 నాటికి 18 నుండి 59 ఏండ్ల వయసు కలిగిన 35,999 మంది నేతన్నలు ఈ పథకానికి అర్హత కలిగి ఉన్నారు.మే 2023 నాటికి మరణించిన 79 మంది నేతన్నల కుటుంబాలకు రూ. 3.95 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

# ప్రసిద్ధి. హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం

**సమ సమాజం):** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రసిద్ధ్ హాస్పిటల్ వారి మొదటి వార్షికోత్సవం సందర్భంగా హాస్పిటల్ నందు ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్లు చైతన్య రాజు,ప్రదీప్,శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అందుబాటులో ధరలతో నామమాత్రపు ఫీజులతో వైద్యం అందించడం జరుగుతుంది అని తెలిపారు.మా హాస్పిటల్ కు వచ్చిన వారి సిబ్బందికి కూడా వసతులు కల్పించడం జరుగుతుంది అని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో డాక్టర్లు పల్లవి,నరేష్,విష్ణు భార్గవ్, త్రివిక్రమ్,హరిణి,సుధీర్ కుమార్ రెడ్డి,విశ్వక్ సేన రెడ్డి,సురేష్ కుమార్,అర్చన రెడ్డి మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# చావోరేవో..

» రాత్రి 8 గం.నుంచి డీడీ స్పోర్ట్స్‌లో.. » ఒత్తిడిలో టీమిండియా » గెలిస్తేనే ఆశలు సజీవం
» సిరీస్‌పై విండీస్ దృష్టి » నేడు మూడో టీ20





ప్రావిడెన్స్ (గయానా): పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టు ఇప్పటి వరకు వరుసగా 11 సిరీసల రికార్డు విజయాలతో కొనసాగుతోంది. కానీ తాజాగా ఆ జైత్రయాత్రకు వెస్టిండీస్ రూపంలో ప్రమాదం కనిపిస్తోంది. ప్రస్తుతం ఐదు టీ20ల సిరీస్‌లో 0–2తో వెనుకబడిన భారత్ నేడు (మంగళవారం) కీలక మూడో మ్యాచ్ బరిలోకి దిగనుంది. వరుసగా రెండు ఓటములతో ఉన్న హార్దిక్ సేన ఈ టీ20లో కచ్చితంగా గెలవాల్సిందే. అలా జరిగితేనే సిరీస్‌లో సజీవంగా ఉంటుంది. ఇక్కడి స్లో పిచ్‌లపై బ్యాటింగ్ చేసేందుకు భారత బ్యాటింగ్ ఆర్డర్ తెగ ఇబ్బందిపడుతోంది. ఈ వైఫల్యంతోనే వరుస పరాజయాలు ఎదురయ్యాయి. అటు విండీస్ మాత్రం అంచనాలకు మించే రాణిస్తోంది. టెస్టు, వన్డే సిరీస్‌లో ఓటమి తర్వాత పొట్టి ఫార్మాట్‌లో చెలరేగుతోంది. అన్ని విభాగాల్లోనూ ఆకట్టుకుంటూ ఇప్పుడు సిరీస్‌పైనే కన్నేసింది. చివరిసారిగా 2016లో కరీబియన్ గడ్డపై భారత్ టీ20 సిరీస్ ఓడింది.

### టాపార్డర్‌పై భారం

పొట్టి ఫార్మాట్‌లో తొలి బంతి నుంచే బ్యాట్లకు పనిచెప్పాల్సి ఉంటుంది. అయితే భారత టాపార్డర్ ఇషాన్, గిల్, సూర్యకుమార్ తమ స్థాయికి తగ్గట్టుగా రాణించడం లేదు. ఐపీఎల్‌లో వీరంతా ప్రత్యర్థులపై విరుచుకుపడినవారే. సిరీస్‌లో వీరి వైఫల్యం మిడిలార్డర్‌పై పడుతోంది. ముఖ్యంగా శాంసన్ రెండు మ్యాచ్‌ల్లోనూ విఫలమయ్యాడు. కానీ తిలక్ మాత్రం ఒత్తిడిని తట్టుకుంటూ పరుగులు రాబట్టడం కాస్త ఊరటనిచ్చే విషయం. ఒకవేళ ఓపెనర్లలో ఒకరిని తప్పించి జైస్వాల్‌ను ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. బ్యాటర్లు మరింత బాధ్యత తీసుకోవాలని కెప్టెన్ హార్దిక్ కూడా తేల్చి చెప్పాడు. వాస్తవానికి ఏడో నెంబర్ వరకు భారత్‌కు పటిష్ట బ్యాటింగ్ లైనప్ ఉంది. నేటి మ్యాచ్‌లో వీరంతా చెలరేగితే విజయం కష్టం కాబోదు. మరోవైపు నికోలస్ పూరన్ ఊచకోతను అరికట్టేందుకు స్పిన్‌త్రయం చాహల్, అక్షర్, కుల్దీప్ చక్కటి వ్యూహంతో బరిలోకి దిగాల్సి ఉంటుంది. కొత్త బంతితో పేసర్లు హార్దిక్, అర్ష్‌దీప్ స్వింగ్‌ను రాబడుతున్నారు. మరో పేసర్ ముకేశ్ భారీగా పరుగులిచ్చుకోవడంతో అవేశ్ లేక ఉమ్రాన్‌లలో ఒకరిని బరిలోకి దింపవచ్చు.

### జట్లు (అంచనా)

**భారత్:** గిల్, ఇషాన్/జైస్వాల్, సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ (కెప్టెన్), శాంసన్, అక్షర్, కుల్దీప్, చాహల్, అర్ష్‌దీప్, ముకేశ్/ఉమ్రాన్.

వెస్టిండీస్: కింగ్, మేయర్స్, చార్లెస్, పూరన్, హెట్‌మయెర్, పావెల్ (కెప్టెన్), హెూల్డర్, షెఫర్డ్, హెూసేన్, జోసెఫ్, మెకాయ్.

### పిచ్, వాతావరణం

రెండో మ్యాచ్‌లాగే ఈసారి కూడా స్లోపిచ్ ఎదురుకానుంది. దీంతో స్పిన్నర్లు కీలకమవుతారు. ఆకాశం మేఘావృతంగా ఉంటూ, మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశం ఉండొచ్చు.

### ఆత్మవిశ్వాసంతో విండీస్

2016 తర్వాత భారత్‌పై వరుసగా రెండు టీ20 మ్యాచ్‌లు గెలవడంతో విండీస్ శిబిరంలో జోష్ కనిపిస్తోంది. ఇదే ఉత్సాహంతో సిరీస్‌ను పట్టేయాలనుకుంటోంది. అయితే విండీస్ టాపార్డర్ కూడా బలహీనంగా ఉంది. బ్యాటింగ్‌లో నికోలస్ పూరన్‌పై ఒత్తిడి పడుతోంది. అతడి బాదుడుకు లక్ష్యం చిన్నదవుతోంది. తనతోపాటు హెట్‌మయెర్ స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగాలనుకుంటున్నారు. ఈ కీలక మ్యాచ్‌లో ఇతర బ్యాటర్లు కూడా రాణిస్తేనే భారీ స్కోరును ఆశించవచ్చు. అలాగే భారత్‌ను కట్టడి చేయడంలో బౌలర్లు సఫలమవుతున్నారు. అందుకే 2–0తో స్పష్టమైన ఆధిక్యంలో ఉండగలిగింది.

### పూరన్‌పై జరిమానా

విండీస్ బ్యాటర్ నికోలస్ పూరన్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత పడింది. రెండో టీ20 సందర్భంగా బహిరంగంగా అంపైర్లను విమర్శించడంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే అతడి ఖాతాలో ఒక డీమెరిట్‌పాయింట్ కూడా వేశారు. భారత ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో అంపైర్ రివ్యూపై తను విభేదిస్తూ వాగ్వాదానికి దిగాడు.

# క్వార్టర్స్‌కు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా

» మహిళల సాకర్ వరల్డ్‌కప్ » ఇంగ్లండ్ క్రీడాకారిణుల విజయానందం



బ్రిస్బేన్: ఫేవరెట్ ఇంగ్లండ్ మహిళల ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ క్వార్టర్స్‌కు చేరుకొంది. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 0–0 (4–2)తో నైజీరియాను షూటౌట్ చేసింది. నిర్ణీత, అదనపు సమయాల్లో ఇరు జట్లూ గోల్ చేయడంలో విఫలం కావడంతో షూటౌట్ అనివార్యమైంది. షూటౌట్‌లో ఇంగ్లండ్ 4–2తో గెలిచింది. 87వ నిమిషంలో స్టార్ ప్లేయర్ లారెన్స్ జేమ్స్ రెడ్ కార్డ్‌తో మైదానం వీడినా.. ఇంగ్లండ్ 10 మందితోనే ఎక్స్‌ట్రాటైమ్‌లో ప్రత్యర్థిని కాచుకొంది. మరో నాకౌట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 2–0తో డెన్మార్క్‌ను ఓడించి రౌండ్–8కు చేరుకొంది. కేట్లిన్‌ఫోర్డ్ (29వ), వేలీరాసో (70వ) చెరో గోల్ చేశారు.



# సన్‌రైజర్స్ చీఫ్ కోచ్‌గా వెటోరి

హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి తమ ప్రధాన కోచ్‌ను మార్చింది. ఈసారి న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ డానియెల్ వెటోరికి బాధ్యతలు అప్పగించింది. గత ఆరు సీజన్లలో జట్టుకు వెటోరి ఐదో కోచ్ కావడం గమనార్హం. ఈ సీజన్‌లో ప్రధాన కోచ్‌గా బాధ్యత తీసుకున్న బ్రయాన్ లారా ఆధ్వర్యంలో జట్టు పదో స్థానంలో నిలిచింది. దీంతో ఫ్రాంచైజీ యాజమాన్యం లారాకు ఉద్వాసన పలికింది. వెటోరి 2014- 2018 మధ్య బెంగళూరుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు.




# ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్ఫూర్తితో టి.ఎస్.పి జాక్ పనిచేస్తుంది

**నల్లగొండ ,సమ సమాజం:** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఉన్న విద్యార్థి నిరుద్యోగ యువత సమస్యలు తెలుసుకోవడం కోసం అన్ని యూనివర్సిటీల పర్యటనలో భాగంగా తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ మహాత్మా గాంధీ యూనివర్సిటీకి రావడం జరిగింది. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ కె.చంద్రశేఖర్ మాట్లాడుతు యూనివర్సిటీ లో ఉన్న సమస్యలను, విద్యార్థుల సమస్యలు, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం జరగాలి అంటే ఆ రోజు తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం మొత్తం ఒక నిశ్శబ్ద యుద్ధం రాజ్యాంగ బద్దంగా జరగాల్సిన అవసరం ఉంది. ఆ యుద్ధం యూనివర్సిటీల నుండి రాజకీయ పార్టీల మేనిఫెస్టో లో పెట్టె వరకు జరుగుతుంది అని తెలిపారు. అలాగే తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ మాట్లాడుతూ మహాత్మా గాంధీ యూనివర్సిటీ సమస్యలు మహాత్మా గాంధీ పేరుకు తగ్గాటుగా రాష్టంలోని నిరుద్యోగ విద్యార్థి, యువత అభివృద్ధి ఆకాంక్షాలకు అనుగుణంగా గాందేయ వాద పద్ధతిలో తెలంగాణ రాష్ట్రం మొత్తం పర్యటన చేస్తాం అని తెలిపారు. అలాగే జేఏసీ స్టేట్ జనరల్ సెక్రటరీ బోడ వంశీ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నికల్లో భాగస్వామ్యం కావాలి, ఈసారి ఓటింగ్ శాతన్ని పెంచాల్సిన భాధ్యత యూనివర్సిటీ విధార్థులుగా మన మీద ఉన్నదని తెలిపారు. అలాగె యూనివర్సిటీ జేఏసీ నాయకుడు మల్లేశం మాట్లాడుతూ మహాత్మ గాంధీ యూనివర్సిటీ సమస్యలు అన్ని కూడా పరిష్కారం కావాలి అంటే మా యూనివర్సిటీ సమస్యలు కూడా ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టో లో ఉండాలి, అలాగే ఈ సారి మేము ప్రత్యక్ష రాయకీయాలలో ఓటు రూపంలో మార్పు తేవడంలో మా యూనివర్సిటీ అన్ని విద్యార్థి సంఘనేతలం, విద్యార్థులం తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ కి అనుబంధం మా హక్కుల సాధనలో ముందు ఉంటాం అని తెలిపారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో కుషాలు, ప్రవీణ్, సాయినాథ్, నావజ్, రమేష్, రాజేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

### జిల్లా పరిషత్ ముట్టడి

**సమ సమాజం:** మండల పరిషత్ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పంచాయతీరాజ్ స్కూల్స్ స్వీపర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 43వ రోజు సమ్మె కొనసాగింది సమ్మెలో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం ముట్టడించగ రెండు గంటల పాటు ఉద్యోగులందరు బయట నిలబడి ఉన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో కాంతమ్మకు వినతి పత్రం సమర్పించడం జరిగింది .మహిళా స్వీపర్లు డిప్యూటీ సీఈవో కాళ్లపై పడి వేడుకున్నారు ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ 43 రోజులుగా ఆందోళన చేస్తున్న అసెంబ్లీలో ప్రతిపక్షాలు స్వీపర్ల వేతనాలు పెంచాలని కోరిన ముఖ్యమంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు సూపర్ లందరూ ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని అన్నారు తక్షణమే స్వీపర్లను రెగ్యులర్ చేయాలని కనీస వేతనం 26,000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం స్పందించకుంటే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు తెలంగాణ ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు భీమగాని గణేష్ ,తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సలివోజు సైదాచారి ముట్టడిలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్వీపర్ల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని డిమాండ్ చేశారు. స్వీపర్ల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు ఈ ముట్టడి కార్యక్రమంలో పంచాయతీరాజ్ స్కూల్ స్లిపర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు పనస నరసింహ గౌడ్ ఉపాధ్యక్షులు పి ఎల్లయ్య ఎండి సత్తార్ మహిళా అధ్యక్షురాలు ఈ పూలమ్మ ప్రధాన కార్యదర్శి ఎండి అనీఫ్ కే యాదగిరి కోశాధికారి వెంకట్ నారాయణ సహాయ కార్యదర్శులు లింగయ్య మేడిగి నాగయ్య ఇస్మాయిల్ స్వామి వి కోటయ్య దేవి కృష్ణవేణి చెన్న కృష్ణయ్య సోమలింగమ్మ తదితరులు పాల్గొన్నారు



# ప్రజాయుద్ధనౌక గద్దర్ కు నివాళులర్పించిన రంగశాయిపేట ఏరియా కమిటీ




**వరంగల్ ,సమ సమాజం:** సోమవారం రోజున రంగశాయిపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నాయుడు పెట్రోల్ పంపు జంక్షన్ వద్ద ప్రజా యుద్ధ నౌక కామ్రేడ్ గద్దర్ గారికి నివాళులర్పించడం జరిగింది అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు మాలోత్ సాగర్ మాట్లాడుతూ రూపకర్తలూ అనతి కాలంలోనే కనుమరుగవుతారు. గద్దర్ స్వయం ప్రకాశమైన ఒక సూర్యుడిలా కనిపిస్తాడు కానీ ఆ నక్షత్రాన్ని మోసిందీ వెలుగులు ఈ లోకం మీద విరజిమ్మేలా బాహువులు సాచిందీ మాత్రం అణగారిన కులాలే. వర్గ వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగా ఆయన రూపొందింది ఎంత నిజమో పీడిత కుల సమాజం ఆయనను తీర్చిదిద్దింది కూడా అంతే నిజం. పాటను ఆయన విప్లవీకరించాడని విమర్శకులు అంటారు. కానీ పాటే ఆయన్ని విప్లవకారుడిగా మార్చింది. ఆ పాటను ప్రజారూపంగా ఆది నుండీ మలిచింది అస్పృశ్య జాతులే. నక్సల్బరీ ఉద్యమమే గద్దర్‌ను సృష్టించింది. తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని ఇప్పటి వరకు వర్గ వాస్తవికత పేరుతో ప్రజాకళాకారుల పరిమితులను విస్మరిస్తూ వచ్చారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం మొదల్కొంది. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజా నాట్యమండలి విశేష పాత్ర పోషించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అన్ని కులాలూ పాల్గొన్నాయి అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి మాట్లాడుతూ గద్దర్ లో ఒక సుగుణం లాంటి మనస్తత్వం వుంది. అది సమాజ చలనశీలతను గమనించే గుణం.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in